# ప్రేమరాగం

కొమ్మూరి సురేఖారెడ్డి కథ

వయసు తేడాలను మరచిన ఆ ప్రేమజంట ఒకటయిందా?

మురళి తక్కున లేచి కూర్చున్నాడు. చుట్టూ చీకటి. కరెంట్ సర్క్యులేషన్ సరిగ్గా లేక బెడ్‌లైట్ వెలిగి ఆరుతుంది.

టైం ఒంటిగంట దాటేవుంటుంది. ఎక్కడో లారీలు వెళుతున్న శబ్దం తప్ప మరే చప్పుడు కాలేదు.

మురళి గుండె వేగంగా కొట్టుకుంటుంది. వచ్చిన పీడకలను జీర్ణం చేసుకోలేక అతడి మనసు విలవిల్లాడుతుంది.

తను సరోజను కలుసుకుని 'ఐ లవ్యూ' అంటూ ఎన్నాళ్ళనుంచో తన గుండెలో దాచుకున్న ప్రేమను చెప్పినట్లు వెంటనే సరోజ తన చెంప పగలకొట్టి 'నువ్వేమిటీ నన్ను ప్రేమించడమేమిటీ?' అని తిట్టేసి వెళ్ళిపోయినట్లు వచ్చిన పీడకలకు మురళి తట్టుకోలేకపోతున్నాడు.

నెమ్మదిగా లేచి లైట్‌వేసి మనసును తేలికబరచుకోవడంకోసం గడగడా గ్లాసుడు మంచినీళ్ళు తాగేశాడు.

మూగప్రేమ ఎప్పటికీ విజయం సాధించలేదు. అందుకే తన మనసులోని ప్రేమను సరోజతో చెప్పెయ్యాలని నెలరోజులుగా రిహార్సల్స్ వేసుకుంటూనే వున్నాడు గట్టిగా. కానీ రోజూ పీడకలలు వస్తూనే వున్నాయి నెగటివ్‌గా. మళ్ళీ చప్పబడిపోతున్నాడు నిరుత్సాహంగా.

ఏం చెయ్యాలి? ఎలా చెప్పాలి? ఆలోచిస్తూ పడుకున్నాడు మురళి.

* * *

మురళి ఆ సంవత్సరమే ఇంటర్ పాసయ్యి డిగ్రీలో చేరాడు. అమ్మాయిలంటే ఆమడ దూరం పరుగుపెడతాడు. అటువం



టి మురళి తమ ఎదురింట్లోకి కొత్తగా వచ్చిన పరమేశ్వరరావుగారి పెద్దమ్మాయి సరోజంటే మాత్రం పడిచస్తాడు.

మురళి కాలేజీనుంచి ఇంటికి వస్తుండగా తమ ఇంటిముందు ఆగిన రిక్షాలోంచి దిగుతూ కనిపించింది సరోజ మొదటిసారిగా.

చూసిన మొదటి క్షణంలోనే అతడి

మనసు ఆమెవట్ల అయస్కాంతాన్ని ఇనుము ఆకర్షించినట్లుగా ఆకర్షించింది గాఢంగా.

తననే మైమరచి చూస్తున్న మురళిని చూసి చిలిపిగా నవ్వి లోపలకు వెళ్ళిపోయింది సరోజ.

అంతే మురళి గుండె లయతప్పింది. ఆ రోజంతా కాలుకాలిన పిల్లిలా వీధి వరండాలో తచ్చాడుతూ తిరిగాడు సరోజ దర్శనంకోసం.

కాని ఆమె కనిపించలేదు.

కాని నిరుత్సాహపడలేదు. ఊహాసౌధాలు కట్టుకుంటూ ఆ రాత్రంతా ఆనందలోకంలో సరోజతో బాగా విహరించి అలసిపోయాడు.

ఆ మర్నాడు కాలేజీలో క్లోజ్ ఫ్రెండ్స్‌తో తన మనసులో విషయాలు చెప్పుకున్నాడు.

స్నేహితులంతా కుతూహలపడ్డారు సరోజను చూస్తామని.

ఆరోజు ఈవెనింగ్ మురళి వీధి వరండా అంతా మురళీ స్నేహితులతో కళకళలాడిపోయింది. సరోజ ఎప్పుడు బయటికొస్తుందా అని ఎదురుచూస్తున్నారు.

వీళ్ళను ఈ టెన్షన్‌నుంచి రక్షించడానికన్నట్లు సరిగ్గా అప్పుడే మల్లెపూలవాడు వచ్చాడు. వాడిని పిలవడానికి సరోజ బయటకొస్తుంది.

సరోజను చూసిన వెంటనే ఫ్రెండ్స్ అంతా షాక్ అయ్యారు. ఆమె అందానికి కాదు. ఆమెను మురళి ప్రేమించినందుకు.

అందరూ కోపంగా మురళివైపు తిరిగి "ఒరే బదుద్దాయ్ నీకింకెవరూ దొరకలేదా? ఆమెకు పాతిక సంవత్సరాలుంటాయి. నీకంటే చాలా పెద్దది. ఎలా ప్రేమించావు" ఆశ్చర్యంగా అడిగారు ఫ్రెండ్స్.

"ఏమో నాకు తెలియదు. కాని సరోజను చూస్తూ రోజులూ, సంవత్సరాలు, యుగాలు గడిపెయ్యాలనిపిస్తుంటుంది. నాలో ప్రతి అణువు ఆమెనే కలవరిస్తున్నాయి. నా మనసును ఆమెనుంచి మళ్ళించలేకపోతున్నాను" బేలగా అన్నాడు మురళి.

"ఒకే మురళీ మగాడు యవ్వనంలో అడుగుపెట్టేటప్పుడు ఈ లోకమంతా అందంగా, అద్భుతంగా కనిపిస్తుందిరా. అటువంటప్పుడు అందమైన అమ్మాయిలు ఎవరు కనిపించినా వయసు, వరస ఏమీ గుర్తురావు. స్వప్నలోకంలో కరగిపోవడం, ఈ రకమైన స్పందనలూ సహజమేరా. నువ్వేం బెంగపడకు కొన్ని రోజులకు నీకీ ప్రేమజ్వరం తగ్గిపోయి మామూలు అయిపోతావు" అని బుజ్జగించాడు స్నేహితుడు ప్రకాష్.

'సరే కాబోలు' అనుకున్నాడు మురళి.

కాని నెలలు, సంవత్సరాలు గడచిపోతున్నా అతడి మనసులోని సరోజ ఆలోచనలు సమసిపోవట్లేదు.

పేపరుకోసం, పత్రికలకోసం వెళ్ళినట్లుగా సరోజ ఇంటికెళుతూ ఆమెతో స్నేహం బాగా పెంచుకున్నాడు మురళి.

అతడ్ని చిన్నపిల్లాడిలా ట్రీట్‌చేస్తూ గలగలా మాట్లాడేస్తుంటుంది సరోజ. సరోజ అతడికంటే పెద్దది కావడంతో, పెద్దవాళ్ళుకూడా వాళ్ళ స్నేహాన్ని పట్టించుకోలేదు.

రోజులు గడుస్తూ వుంటే మురళికి

సరోజమీద ఇష్టం పెరుగుతూ వచ్చింది. కాని తన మనసులో విషయం సరోజకు చెప్పలేకపోతున్నాడు.

ఏది ఏమైనా తన గుండెలో గూడుకట్టుకున్న ప్రేమామృతాన్ని సరోజముందు పరచాలి. గట్టిగా అనుకున్నాడు మురళి.

* * *

"ఆ ఏమిటి మురళీ కనిపించడంలేదు పరీక్షలు బాగా వ్రాశావా? కూర్చో కాఫీ తెస్తాను" చనువుగా అంది సరోజ.

"బాగానే వ్రాశానుగాని, ఇప్పుడు కాఫీ ఏమీ వద్దు, ఒక్కసారి ఇటురండి."

"ఆ ఏమిటి చెప్పు!"

"... ... ..."

"అయ్ ఈ రోజు కొత్తగా చూస్తున్నావు ఎందుకు పిలిచావో చెప్పు" నవ్వుతూ అంది సరోజ.

ఒణుకుతున్న పెదాల్ని ఒక్కసారి తడిచేసుకుని "మీతో పర్సనల్‌గా మాట్లాడాలి" నెమ్మదిగా చెప్పాడు మురళి.

"నాతో పర్సనల్‌గా మాట్లాడాలా?" ఆశ్చర్యంగా అడిగింది సరోజ.

"ప్లీజ్..."

"సరే ఏమిటో చెప్పు"

"ఇక్కడ కాదు"

"మరెక్కడ?"

"ఈరోజు ఈవెనింగ్ ఇందిరాపార్క్‌లో కలుసుకుందాం" ధైర్యం తెచ్చుకుని అన్నాడు మురళి.


"నాకు వీలుపడదు" సీరియస్‌గా అంది సరోజ.

"ప్లీజ్..."

"సరే ట్రైచేస్తాను" అయోమయంగా మురళిని చూస్తూ లోపలికెళ్ళింది సరోజ.

* * *

"ఆ ఇప్పుడు చెప్పు. ఏమిటీ నాతో చెప్పే విషయం?"



''సరోజా ఎన్నాళ్ళనుంచో మీతో చెప్పా లనీ, చెప్పలేక మదనపడుతున్న విషయాన్ని మీతో చెప్పుకుంటున్నాను. మీరు అర్థం చేసుకోలేకపోయినా అపహాస్యం మాత్రం చేయవద్దు.''

''నేను అర్థం చేసుకోలేని విషయమా నీవు చెప్పేది? ఏమిటో వింతగా మాట్లాడు తున్నావు మురళీ" సీరియస్‌గా అంది సరోజ.

''మీరు అర్థం చేసుకుంటే ధన్యుణ్ణే. కాని నేను చెప్పేవిషయంలో తప్పు వుంటే క్షమించండి. అంతేగాని కోపంతో నాకు దూరమై మీనుంచి ఈ కాస్త స్నేహాన్నికూడా దూరం చేయకండి'' ప్రాధేయపూర్వకంగా అన్నాడు మురళి.

''ఇంతకీ నీవు చెప్పే విషయం ఏమిటీ?" ఉత్కంఠతో అడిగింది సరోజ.

''....''

''ఏమిటీ సస్పెన్స్? మాట్లాడు మురళీ' అసహనంగా అంది సరోజ.

''ఐ లవ్యూ సరోజా. ఐ లవ్యూ'' తన్మయంగా అనేశాడు మురళి.

తక్కున లేచి నుంచుంది సరోజ.

''ఏమిటి మాట్లాడుతున్నావు మురళీ? నీకేమైనా

మతిచలించిందా?'' కోపంగా అంది సరోజ.

''ప్లీజ్ సరోజా శాంతించండి. నెమ్మది గా ఆలోచించండి. అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి'' తనూ లేచినుంచుంటూ అన్నాడు మురళి.

''మురళీ నీవు ఇలా మాట్లాడినందుకు నీపై కోపంకంటే జాలే కలుగుతుంది నాకు''

''ఎందుకు?''

''ఎందుకంటే చక్కగా చదువుకోవలసి న ఈ వయసులో ఏమిటేమిటో ఊహించు కుంటూ అనవసరమైన విషయాలగురించి ఆలోచిస్తూ నీ మనసును నీ అధీనంలో పెట్టుకోగల కెపాసిటీ నీకు లేవందుకు''

''చాలా పొరబడుతున్నారు సరోజా. ఎన్నాళ్ళో ఘర్షణ తరువాతే నేనీ నిర్ణయం తీసుకున్నాను. మీనుంచి నా మనసును మళ్ళించాలని సర్వవిధాలా ప్రయత్నించి సాధ్యంకాక నాలో వున్నది నిజమైన ప్రేమని నాకు అవగతమయ్యాకే నా మనసును మీ ముందు విప్పాను.''

''మురళీ నిన్ను అర్థం చేసుకోగలను. నీవు నాపై ఆరాధనగా చూస్తున్నప్పుడు నాకూ నీపట్ల ఏదో తెలియని అనురాగం ఉప్పొంగేది. కాని నాలో కలిగిన ఈ ప్రేమను నీవు వ్యక్తపరిచినట్లుగా నేను పైకి చెప్పలేకపోయాను. అందుకు కారణం. ఈ విషయం బయటకు తెలిస్తే లోకం నవ్వే తప్పుపడుతుంది. అందుకే నా మనసులో నీపట్ల గలిగే ప్రేమానురాగాన్ని చంపేసుకు న్నాను. ఇప్పుడు నీపట్ల నాకా భావం లేదు.''

''అదే మంచిపద్ధతి కాదంటాను సరో జా.''

''మన మనసుల్ని మనం ఎందుకు చంపుకోవాలి? ఊహాసౌధాలను కట్టుకోవడం తప్పుకాదు. కాని ఆ సౌధాలకు క్రిందనుంచి పునాదులేసుకుంటూ వాస్తవ రూపం దాల్చ

డంలోనే మానవుల సమర్థత ఆధారపడి వుంది. అంతేగాని మనసును చంపుకోవడమ నేది అసమర్థతే."

"తప్పదు మురళీ. జరగదూ అనుకున్నపుడు ఆశించకుండా వుండడమే వివేకం. అసలు ఇది ఎలా సాధ్యం అనుకున్నావు? మన మధ్య వయసు వ్యత్యాసముంది. అంతేకాదు. మా ఆర్థిక పరిస్థితి మీకు తెలుసు. చదివించే స్తోమత లేక నన్ను ఇంటర్‌తోనే చదువు మానిపించారు. టైపు నేర్చుకుంటూ కాలం గడుపుతున్న నేను ఏ విధంగానూ నీకు భార్య కాదగ్గ అర్హత నాకు లేదు."

"అలా మాట్లాడవద్దు సరోజా, మంచి మనసుకంటే అర్హమైనది ఈ ప్రపంచంలో మరేదీ లేదు."

"నువ్వేదో ఊహాలోకాల్లో మునిగిపోతున్నావు మురళీ. సినిమాలు, నవల్స్ చదివి అవే జీవితాలని భ్రమపడకూడదు. వాస్తవాన్ని ఆలోచించి అడుగులు వెయ్యాలి" నచ్చచెపుతున్నట్లుగా అంది సరోజ.

"లేదు సరోజా. మీరు పొరబడుతున్నారు. సినిమాలు, నవల్స్ ఎక్కడనుంచి వస్తున్నాయి. మనలాంటివాళ్ళ జీవితాలనుంచే కదా వాళ్ళు సృష్టించేది! ఆవేశంతో నిర్ణయం తీసుకోవద్దు. నెమ్మదిగా ఆలోచించి నన్ను అర్థం చేసుకోండి."

"ఇందులో అర్థం చేసుకోవడానికి, ఆలోచించడానికి ఏమీ లేదు. లోకం దృష్టిలో నన్ను దోషిగా నిలబెట్టకుండా వుండాలనుకుంటే, మనమధ్య ఈ మాత్రం స్నేహమైనా వుండాలి అని నీవనుకుంటే ఇకముందెప్పుడూ ఇలా ఆలోచించకు. ఇది నా హెచ్చరిక.' వడివడిగా ముందుకు నడిచింది సరోజ. మరికాస్సేపు అక్కడుంటే అతడి ప్రేమకు కరిగిపోతానేమోననే భయంతో.

మురళి స్వప్నసౌధాలు కుప్పగా కూలిపోయాయి.

* * *

"ఏమండీ! ఆ భుజంగరావుగారమ్మాయికి పెళ్ళి చెయ్యాలనుకుంటున్నారట. ఆ అమ్మాయి మనబ్బాయికైతే బాగుంటుందండీ."



## కుట్ర

అప్పారావుతో చెప్పాడు జోగారావ్—
"మా పక్కింటి పరమేశంగాడు చేసిన కుట్రకి నేను దారుణంగా బలైపోయాన్రా!"
"అలాగా! ఏం చేశాడేమిటి?!"
"ఓ అరడజను పట్టు చీరలు అద్దెకు తెచ్చి, వాళ్ళావిడతో కట్టించి, అవి తానే కొన్నట్టు మా ఆవిడ్ని నమ్మించాడు!" బావురుమన్నాడు జోగారావ్.

—మోటూరి రాధ

"నువ్వేం మాట్లాడుతున్నావు? మన మురళికి అప్పుడే పెళ్ళేమిటి?"

"మీ బుర్రలో అసలు తెలివితేటలు లేవు. మన వాడికి ఇప్పుడే పెళ్ళి చేసేస్తామా ఏమిటి? తాంబూలాలు మాత్రమే తీసుకుంటాం. మళ్ళీ అటువంటి సంబంధం వస్తుందా? ఒకర్తే కూతురు. బోల్డు ఆస్తి వుంది." రహస్యం చెపుతున్నట్లుగా నెమ్మదిగా చెప్పింది పార్వతమ్మ.

"అబ్బ. ఇప్పుడెందుకే. వాడి చదువు డిస్ట్రబ్ అవుతుంది."

"మీదంతా చాదస్తం. మీరేం మాట్లాడకండి. ఈ నేపథ్యంలో తాంబూలాలు తీసుకోవలసిందే" గట్టిగా అంది పార్వతమ్మ.

అప్పుడే వచ్చిన మురళి తల్లిదండ్రులు దేనిగురించో వాదించుకోవడం చూసి, ఇది మామూలే అనుకుని గబగబా పైకి వెళ్ళబోయాడు.

అంతలో పిలిచింది పార్వతమ్మ. "ఒరే నాయనా ఇటురారా" అంటూ.

"ఎందుకమ్మా?" తల్లి ప్రక్కన కూర్చుంటూ అడిగాడు మురళి.

"ఎల్లుండి ఏకాదశి కదరా. మంచిరోజు. భుజంగంగారింటికి పెళ్ళిచూపులకు వెళ్ళబోతున్నాం. నువ్వు రెడీగా వుండు."

"ఎవరికి పెళ్ళి?" ఆశ్చర్యంగా అడిగాడు మురళి.

"ఇంకెవరికీ నీకే!"

"నాకా? ఇప్పుడా? నాకు చదువు పూర్తయ్యి జాబ్ వచ్చేవరకూ నేను పెళ్ళిచేసుకోదలచుకోలేదు" సీరియస్‌గా అన్నాడు మురళి.

తన కొడుకుకి చదువుమీదున్న శ్రద్ధకు మురిసిపోతూ, "నువ్వన్నదీ కరెక్టేనురా. అయితే ఇప్పుడు కేవలం తాంబూలాలు తీసుకోవడమే. పెళ్ళి తరువాత నీకిష్టమైనప్పుడే చేసుకోవచ్చు. ఈ సంబంధం వదిలేసుకుంటే ఇంత ఆస్తివున్న సంబంధం మళ్ళీ రాదురా" లాలనగా అంది పార్వతమ్మ.

"అమ్మా దయచేసి నాదగ్గర పెళ్ళి ప్రస్తావన తేవద్దు"

"పెద్దవాళ్ళ మాటంటే అసలు లెక్కలేకుండా పోయిందేమిరా నీకు?" కోపంగా అంది పార్వతమ్మ.

"సరే మీరు సీరియస్ అయ్యారు కాబట్టి నేనూ సీరియస్‌గా చెపుతున్నాను. నేను పెళ్ళంటూ చేసుకుంటే ఎదురింటి సరోజనే చేసుకుంటాను." సీరియస్‌గా చెప్పాడు మురళి.

ఒక్కసారిగా మురళి అలా అనేసరికి ఆ భార్యాభర్తలకు షాక్‌తో నోటమాట రాలేదు. ముందుగా పార్వతమ్మ తేరుకుని

"ఎవరూ ఆ పోస్టుమాస్టారి కూతుర్నా?"

"అవును" దృఢంగా అన్నాడు మురళి.

"ఓరి అప్రాచ్యుడా! నీకిదేం బుద్ధిరా?" అన్నాడు తండ్రి కోపంగా.

"నీకేమైనా పిచ్చిపట్టిందా?" అరిచింది పార్వతమ్మ.

"మీరేమనుకున్నా నా నిర్ణయం ఇదే" స్థిరంగా చెప్పేసి వడివడిగా పైకెళ్ళిపోయాడు మురళి.

"అలా బెల్లంకొట్టిన రాయిలా చూస్తారేమిటండీ. ఆ టక్కులాడే వీడికేదో మందు పెట్టింది. ఆ ఇంటి ఓనరు మీ ఫ్రెండేకదా. వెంటనే వాళ్ళని ఇల్లు ఖాళీ చేయించండి"

హూంకరించింది పార్వతమ్మ.

పార్వతమ్మ ఆజ్ఞాపించిందీ అంటే జరిగి పోవలసిందే.

మరికొన్ని రోజులకు సరోజ ఇంటిముందు 'టులెట్' అన్న బోర్డు చూసి మురళి మనస్సు కలుక్కుమంది.

* * *

రోజులు, సంవత్సరాలు గడచిపోతున్నాయి వేగంగా.

పట్టుదల వుంటే సాధించలేనిది వుండదు అనేవారికి నిదర్శనంగా మురళి తన సాధనలో ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ వచ్చాడు. పోస్టుగ్రాడ్యుయేషన్‌లో గోల్డ్ మెడలిస్ట్ అయ్యాడు. ఎపిపిఎస్‌సి పరీక్షలు వ్రాసి మంచి జాబ్ సంపాదించాడు.

మురళి పెళ్ళిగురించి ఇంట్లో ఘర్షణ జరుగుతూనే వుంది. కాని పెళ్ళికి మురళి సుముఖత చూపలేకపోతున్నాడు.

ఈ ఆధునిక ప్రపంచంలో సాధ్యమైనంత తక్కువ పనిచేస్తూ ఎక్కువ టైమ్‌ను ఎంజాయ్ మెంట్‌కు ఉపయోగించుకోవాలని తహతహలాడే నేటి యువత ఆడే ఆటల్లో మురళీకూడా భాగం పంచుకుంటూనే వున్నాడు.

కాని ఎవరితో ఏ ఆట ఆడినా మురళి వెలితిగానే, అసంతృప్తిగానే ఫీలవుతున్నాడు.


ఫ్రెండ్స్ ఎవరైనా వున్నప్పుడే తెచ్చిపెట్టుకున్న హుషారుతో మెలుగుతుంటాడు. మళ్ళీ ఒంటరిగా మిగిలిపోయినపుడు మనస్సంతా శూన్యత, నిరుత్సాహం మురళిలో ఆవరించి వేధిస్తున్నాయి.

ఈ స్థితిలో వున్న మురళి జీవితం అనుకోకుండా మలుపు తిరిగి కూలిపోయిన అతడి స్వప్నసౌధాలు వాస్తవరూపం దాల్చాయి.

* * *

ఒకరోజు మురళి స్కూటర్‌మీద ఆఫీసు నుంచి ఇంటికి వెళుతున్నాడు.

దూరంనుంచి ఒకామె నడచివస్తూ వుంది.




## ప్రాచీన చెరసాల

ప్రపంచంలో అనేక జైళ్లు వున్నాయి. అయితే అత్యంత ప్రాచీనమైన జైలు ఎక్కడ వుందో మీకు తెలుసా? గ్రీస్‌లోని ఏథెన్స్ నగరంలో ప్రాచీనమైన జైలు వుంది. ఇది 2,380 సంవత్సరాలనుంచి ఒకేచోట వుంది. ప్రముఖ తత్త్వవేత్త సోక్రటీస్‌ను కూడా ఇదే జైలులో కొంతకాలం వుంచారు. ఇలా ఎందరో ప్రముఖులు ఈ చెరసాలలో బంధింపబడ్డారు.

—జూపిటర్

ఆ నడక, ఆమె తనకు పరిచయమయిన ట్లనిపించి మరింత స్పీడుగా ముందుకు వెళ్ళాడు. ఆమెనుచూపి తక్కువ స్కూటర్ ఆపి 'సరోజా...' తనలో అనుకున్నట్లే పైకి అనేశాడు.

ఉలిక్కిపడి ప్రక్కకు తిరిగి మురళిని చూపి స్తంభించిపోయింది సరోజ.

సుమారు ఐదు సంవత్సరాల తరువాత ఒకరినొకరు చూసుకుంటున్నారు. ఆత్మీయతతోకూడిన తియ్యటి భావన వాళ్ళిద్దరి గుండెలనిండా ఆవరించి మాటలు రావట్లేదు.

ముందుగా సరోజ తేరుకుంది.

"మీరు ఇక్కడ...?"

"ఇక్కడ సెక్రెటేరియట్‌లో జాబ్ చేస్తున్నాను"

"మరి మీరు ఇక్కడ...?" సందేహంగా అడిగాడు మురళి.

"ఒక టైపిస్టు పోస్టు ఖాళీ వుందంటే ఇంటర్వ్యూకు వెళ్ళివస్తున్నాను"

"ఇంకా పోరాడుతూనే వున్నారా?"

"తప్పదుకదా!"

"ఇలా రోడ్డుమీద బావుండదు అలా ఎక్కడైనా పార్క్‌లో మాట్లాడుకుందాం" సందేహంగానే అడిగాడు మురళి.

వెంటనే ఒప్పుకుంది సరోజ 'సరే' అంటూ.

పచ్చని చెట్లమధ్య చల్లనిగాలిలో పచ్చికమీద కూర్చున్న ఇద్దరికీ మనసంతా తేలికగా, ఒకవిధమైన తృప్తితో హాయిగా వుంది. కాని ఈ హాయి మళ్ళీ పోతుందేమో అనే ఆందోళన మిళితమై వుంది ఇద్దరి ముఖాల్లో.

"చెప్పండి మురళీ ఏమి చేస్తున్నారు? ఎలా వున్నారు?"

"ఏముందీ, రోజులు యాంత్రికంగా గడచిపోతున్నాయి. మీరేమిటీ కొత్తగా 'మీరు' అని సంబోధిస్తున్నారు?"

"అప్పుడైతే చిన్నపిల్లాడిలా అనిపించేవారు. ఇప్పుడలా అనిపించడంలేదు. సరేగాని మీ మిసెస్ ఏమి చేస్తున్నారు?" మామూలుగా అడిగింది సరోజ.

"నేను పెళ్ళి చేసుకోలేదు" ఎటోచూస్తూ చెప్పాడు మురళి.

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగింది సరోజ.

"ఇష్టంలేక. మనసు సహకరించక" క్యాజువల్‌గా చెప్పాడు మురళి.

"... ... ..."

"... ... ..."

ఇద్దరిమధ్యా కొంతసేపు మౌనం తరువాత అంది సరోజ.

"మురళీ నేను మీతో నా మనసులో ఉన్న ఒక విషయం చెప్పదలచుకున్నాను. మీరు అర్థం చేసుకోలేకపోయినా అపహాస్యం మాత్రం చేయవద్దు" అంది సరోజ నెమ్మదిగా తలవంచుకుని.

"ఒకప్పుడు నేను ఇలాగే అడిగాను. మీరు నా మనసును అర్థం చేసుకోలేక అపహాస్యం చేశారు. నేను దేనినైనా అర్థం చేసుకుంటాను చెప్పండి సరోజా..."

"ఆ రోజులు ఇంకా గుర్తున్నాయా మురళీ?"

"ఎలా మరచిపోతాననుకున్నారు? ఇంతకూ మీరు చెప్పే విషయమేమిటి?"

"మురళీ జీవితం అనేది అతి చిన్నది.

అనేక స్మృతులు, అనుభూతుల మిళితమై వుండే ఈ చిన్న జీవితంలో నిరీక్షణతోను, ఎవరో ఏదో అనుకుంటారనే భయపూరిత ఆలోచనలతోను వ్యర్థం చేసుకోవడం మూర్ఖత్వమేననిపిస్తుంది.

అన్నయ్య పెళ్ళిచేసుకుని ఏమీ పట్టనట్లు వెళ్ళిపోయాడు. మా ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. ఆనాడు లోకానికి భయపడి మిమ్మల్ని తిరస్కరించాను. అది చాలా పూలిష్ నిర్ణయమని చాన్నాళ్ళకు గ్రహించాను.

రోజులూ, సంవత్సరాలూ గడచిపోతున్నాయి. ఈ నిరీక్షణలోనే నా జీవితం కరిగిపోతుంది. నాకంటూ ఒక మనిషి కావాలి. నన్ను గుండెలో దాచుకునే ఒక నిండైన ఎద కావాలి. అందుకే... అందుకే... నిన్ను కోరుకుంటున్నాను మురళీ. నీవు నాకు కావాలి. ఐ లౌ యూ మురళీ ఐ లౌ యూ..." ఉద్వేగంగా అంది సరోజ.

మురళి ఏమీ మాట్లాడలేకపోయేసరికి సరోజ ఆశలన్నీ నిరాశలైపోయాయి.

"సారీ మురళీ, మీ మనసును గ్రహించకుండా మీకోసం ఆశపడ్డాను. సారీ... వెరీవెరీ సారీ..."

అక్కడ ఒక్క క్షణం ఉండలేక వడివడిగా వచ్చేస్తున్న సరోజకు వెనుకనుంచి వినిపించింది మురళి గొంతు "సరోజా..." అంటూ.

వేగంగా వచ్చి సరోజ చేతులు పట్టుకొని ఆర్ద్రత నిండిన మనసుతో అన్నాడు మురళి.

"ఇది కలా, నిజమా అనే సందిగ్ధంలో పడి ఏమీ మాట్లాడలేకపోతున్నాను సరోజా. ఈ రోజు కోసమే నేను ఎదురు చూస్తున్నాను... ఈ రోజుకోసమే..."

అతడి మాటలకు సరోజ మదిలో మిణుకుమిణుకుమంటున్న జ్యోతి ఒక్కసారిగా ప్రజ్వరిల్లింది.

"నేను అదృష్టవంతురాల్ని మురళీ... నేను అదృష్టవంతురాల్ని..." ఆమె గుండెలో ఆనందంతో కూడిన దుఃఖం వెల్లువలా పొంగింది.

*

